# నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్ - నిర్మల్

5 | నిజామాబాద్ గురువారం 17 ఏప్రిల్ 2025 | ADILABAD NIRMAL


## ఎనిమిదో రోజూ నిరసన

**మద్దతు తెలిపిన బీఆర్ఎస్ నాయకులు**



స్వచ్ఛ భారత్ నిర్వహిస్తున్న కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు

బాసర, ఏప్రిల్ 16 : బాసర ఆర్జీయూకేటీలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. తమ సమస్యల పరిష్కారానికి కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మూకుమ్మడిగా రాజీనామా చేసి నిరసనకు దిగారు. ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు కొనసాగిస్తామని, లేని పక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో భాగంగా బుధవారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. వారి నిరసనకు బీఆర్ఎస్ నాయకులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా ముథోల్ టీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ కొమ్రేవార్ పాల్గొన్నారు. అనంతరం వారు తమ సమస్యలపై వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

## ఓపెన్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి..



మాట్లాడుతున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ అర్బన్, ఏప్రిల్ 16 : పదో తరగతి, ఓపెన్ ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో పరీక్షల నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఓపెన్ ఇంటర్ పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలకు ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశామని, పదో తరగతికి 697 మంది, ఇంటర్‌కు 511 మంది హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేందర్‌రెడ్డి, డీఈవో రామారావు పాల్గొన్నారు.




గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

## బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

రాముడి పేరు చెప్పి ఓట్లు దండుకుని అభివృద్ధి, హామీలను విస్మరించిన బీజేపీని యువత నమ్మడం లేదని బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులు నరేశ్, శరత్ ఆధ్వర్యంలో గాంధీనగర్, ఇందిరానగర్‌కు చెందిన 50 మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యువకులకు మాజీ మంత్రి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామన్న మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ జిల్లాకు చేసిందేమి లేదని, ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. సీసీఐ పునరుద్ధరణ, ఆదిలాబాద్ టూ ఆర్మూర్ రైల్వే లైన్, ఎయిర్ పోర్టు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయని తెలిపారు. వాటిని ఇప్పటి వరకు పూర్తి చేయలేదన్నారు. ఎన్నికల సమయంలో రాముని పేరు చెప్పుకుని ఓట్లు దండుకుని అధికారం చేపట్టి హామీలను విస్మరించారన్నారు. బడుగు బలహీన వర్గాలు సుఖంగా ఉండాలంటే, బీఆర్ఎస్, కేసీఆర్ కావాలనే ఉద్దేశంతో యువత బీఆర్ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. దేశం, మతం కోసం అంటున్న బీజేపీ నాయకులు అధికారం చేపట్టి సంవత్సర కాలం దాటిందని, ఈ కాలంలో ఎన్ని ఆలయాలు కట్టారో చెప్పాలని సవాల్ విసిరారు. దేశంలో బీజేపీ, జిల్లాలో ఎంపీ, ఎమ్మెల్యే గ్రాఫ్ పడిపోయిందని ఎద్దేవా చేశారు. తాము సీసీఐ గురించి అడిగితే ఎంపీ, ఎమ్మెల్యేలు ఎయిర్‌పోర్టు గురించి మాట్లాడుతున్నారని, ఎయిర్ పోర్టుకు తాము వ్యతిరేకం కాదన్నారు. సీసీఐ పునరుద్ధరిస్తే 10 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అజయ్, నారాయణ, అశోక్, ధమ్మపాల్ పాల్గొన్నారు.

*- ఎదులాపురం, ఏప్రిల్ 16*

## బీఆర్ఎస్ వైపే అన్ని వర్గాల ప్రజలు



బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రమాదేవి

భైంసా, ఏప్రిల్ 16 : అన్ని వర్గాల ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉన్నారని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు పడకంటి రమాదేవి అన్నారు. బుధవారం పట్టణంలోని తన కార్యాలయంలో తానూర్ మండల మాజీ ఎంపీపీ మంజుల సురేశ్ యాదవ్ బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ శ్రేణులు, ఉద్యమకారులు, అభిమానులు, ప్రజలు తరలిరావాలని కోరారు.




రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు లోలం శ్యాంసుందర్

## రజతోత్సవ సభకు కదం తొక్కాలి

సాగునీటి ప్రాజెక్టులతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీ ముథోల్ నియోజక వర్గ సమన్వయ కమిటీ సభ్యుడు లోలం శ్యాంసుందర్ అన్నారు. బుధవారం కుంటాల మండల కేంద్రంలో కార్యకర్తలతో కలిసి రజతోత్సవ సభ సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ రావడం వల్లనే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, అమలు కానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందుతున్నారని మండిపడ్డారు. మళ్లీ కేసీఆరే సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఈ నెల 27న జరగనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభ కోసం కార్యకర్తలు, నాయకులు ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పడకంటి దత్తు, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ పెంటవార్ దశరథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొంతల పోశెట్టి, రజనీకాంత్, వంశీ, రమేశ్, శ్రీనివాసరావు, రాజు పాల్గొన్నారు.

*- కుంటాల, ఏప్రిల్ 16*

## వరంగల్ సభను సక్సెస్ చేయండి

బాసర, ఏప్రిల్ 16 : వరంగల్‌లో నిర్వహించనున్న టీఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యులు కిరణ్ కొమ్రేవార్ పేర్కొన్నారు. బుధవారం బాసర మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు కోర్వ శ్యామ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వరంగల్ సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వరంగల్ సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై సభను విజయవంతం అయ్యే విధంగా కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గంగారావు, నర్సింగరావు, దిగంబర్, లక్ష్మారెడ్డి, గంగాధర్, నాగనాథ్, లాల్మీయ, బాబుమియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయ సమితి సభ్యుడు కిరణ్ కొమ్రేవార్

జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ టోల్ ప్లాజా




# టోల్ బాదుడు

**చార్జీలు పెంచిన ఎన్‌హెచ్ఏఐ**

- ఆదిలాబాద్‌లో రెండు టోల్‌ప్లాజాలు
- రోజు రూ.10 లక్షల వరకు అదనపు భారం
- పెరిగిన ధరలు నేటి నుంచి అమలులోకి..
- అస్తవ్యస్తంగా రహదారులు

ఆదిలాబాద్, ఏప్రిల్ 16(నమస్తే తెలంగాణ) ః కేంద్ర ప్రభుత్వం బడుగు జీవులపై మరోభారం మోపింది. ఇప్పటికే నిత్యావసరాలు, ఇతర ధరల కారణంగా ఇబ్బందులు పడుతున్న పేదలపై టోల్ చార్జీలు పెంచుతూ నిర్ణయం తీసుకుంది. ఆదిలాబాద్ జిల్లాలో 80 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి ఉంది. జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ, నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ వద్ద హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారిపై రోజు 10 వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తాయి. పెంచిన ధరల కారణంగా వాహనదారులపై రోజు రూ.10 లక్షల భారం పడనుంది. పెరిగిన ధరలు ఏప్రిల్ ఒకటి నుంచి అమలవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ అథారిటీ హైవే ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఏఐ)టోల్ చార్జీలు పెంచడంతో వాహనదారులు ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తున్నది. రవాణా సరుకులకు తీసుకెళ్లే ట్రాన్స్‌పోర్టు వాహనాలు ఈ రోడ్డు మీదుగా అధికంగా వెళ్తుంటాయి. జిల్లావాసులు తమ అవసరాల కోసం హైదరాబాద్‌తోపాటు మహారాష్ట్రలోని వివిధ ప్రాంతాలకు వెళ్తుంటారు.

### రోజు రూ.10 లక్షల అదనపు భారం

ఆదిలాబాద్ జిల్లాలోని జాతీయ రహదారి-44పై నేరడిగొండ మండలంలోని రోల్‌మామడ, జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ వద్ద 2008లో ఏర్పాటు చేసి టోల్‌టాక్స్ వసూలు చేస్తున్నారు. ఈ రహదారిపై రోజు కార్లు, బస్సులు, లారీలు, గూడ్స్ వాహనాలు, ఇతర భారీ వాహనాలు 10 వేల వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు కూడా వివిధ ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేస్తాయి. ప్రస్తుతం టోల్‌ప్లాజాల్లో కార్లు, వ్యాన్, లైట్ మోటార్ వెహికిల్‌పై 24 గంటల్లో రాకపోకలకు రూ.165, మినీ బస్సు, లైట్ కమర్షియల్ వెహికిల్, లైట్ గూడ్స్ వాహనానికి రూ.265, బస్సులు, ట్రాక్‌లకు రూ.560కి పెరిగింది. ఇతర వాహనాలకు రూ.610, రూ.875, రూ.1065కు ఉంది. పెరిగిన ధరల ఫలితంగా రోజు ప్రయాణికులపై రూ.10 లక్షల భారం పడనుండగా.. నేటి(గురువారం) నుంచి ధరలు అమల్లోకి వస్తాయి. వాహనదారులతోపాటు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే పేదలు కూడా నష్టపోవాల్సి వస్తుంది.



### అస్తవ్యస్తంగా రహదారి

ఎన్‌హెచ్-44 నిర్వహణను ఎన్‌హెచ్ఏఐ అధికారులు గాలికొదిలేశారు. నేరడిగొండ నుంచి జైనథ్ మండలంలోని పిప్పర్‌వాడ వరకు రోడ్లు నిర్మాణ లోపాల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల జైనథ్ మండలంలోని భోరజ్ చెక్‌పోస్టు సమీపంలో వరుసగా మూడు రోజులు ప్రమాదాలు జరగ్గా ముగ్గురు చనిపోయారు. రోడ్డుకు ఇరువైపులా అవసరమైన చోట సర్వీస్ రోడ్లు, స్లీప్ రోడ్లు, అండర్ పాస్‌లు చేపట్టలేదు. ప్రమాదాల నివారణ కోసం చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు గతంలో పలుమార్లు నేషనల్ హైవే ఆథారిటీ అధికారులను కోరినా ఫలితం లేదు. జాతీయ రహదారిపై గతంలో మావల క్రాసింగ్, మావల మూలమలుపు, దేవాపూర్ క్రాసింగ్, గుడిహత్నూర్ బస్టాండ్ ఏరియా, గాంధీనగర్, ఉట్నూర్ క్రాస్‌రోడ్డు, సీతాగోంది ప్రాంతాల్లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వీటిని అధికారులు బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించినా చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. చార్జీలు పెంచుతున్న నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్లను బాగు చేయకపోవడంపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### టోల్‌ప్లాజా ధరలతో భారం

*పెరిగిన డీజిల్ ధరలతో ఇబ్బందులు పడుతున్నాం. జాతీయ రహదారిపై టోల్‌ప్లాజా ధరలు పెంచడంతో వాహనదారులపై భారం పడనుంది. ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ వరకు ఐదు టోల్‌ప్లాజాలు ఉంటాయి. రూ.1,500 టోల్‌ప్లాజాలకు చెల్లించాల్సి వస్తుంది. నేషనల్ హైవే అథారిటీ అధికారులు రోడ్ల గురించి పట్టించుకోకుండా ధరలు మాత్రం బాగా పెంచుతున్నారు. రహదారి సరిగా లేని కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. రహదారిపై కనీస సౌకర్యాలు లేవు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు పెంచిన ధరలను వెనక్కి తీసుకోవాలి.*

**- మోహన్, వాహనదారుడు, ఆదిలాబాద్**



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్



## లక్షతోపాటు తులం బంగారం అందించాలి

**బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్**

బజార్‌హత్నూర్, ఏప్రిల్ 16 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కల్యాణ లక్ష్మి రూ.లక్షతోపాటు తులం బంగారం అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బజార్‌హత్నూర్ మండలంలోని 42 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న ఆరు గ్యారెంటీల్లో ఒకటైన తులం బంగారం వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్, నాయబ్ తహసీల్దార్ హరిలాల్, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ రాజారాం, బీఆర్ఎస్ నాయకులు భూమయ్య, లక్ష్మణ్, సకేశ్, రమణ, సాయన్న, కవీందర్, జనార్దన్, సాయిచైతన్య, జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల సంస్మరణ దినోత్సవ ఏర్పాట్ల పరిశీలన



అమరవీరుల స్తూపం వద్ద స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 16 ః అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మొదటిసారి అధికారికంగా నిర్వహిస్తున్నామని, దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. బుధవారం అమరవీరుల స్తూపంతోపాటు ఏప్రిల్ 20న నిర్వహించే సంస్మరణ దినోత్సవం సభ ఏర్పాటు స్థలాన్ని వారు ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, ఏఎస్పీ కాజల్‌సింగ్, రగల్ జెండా అమరవీరుల ఆశయ సాధన కమిటీ సభ్యులు, ఆదివాసీ గిరిజన పెద్దలు, తుడుందెబ్బ నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని అధికారికంగా ఐటీడీఏ ద్వారా చేపడుతున్నామన్నారు. అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి మంత్రి సీతక్క వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవో జనరల్ వసంత్‌రావ్, డీడీ అంబాజీ, ఈఈ తానాజీ, ఏసీఎంవో జగన్, రగల్ జెండా అమరవీరుల ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు తోడసం నాగోరావ్, సార్‌మేడిలు మెస్రం దుర్గు, మెస్రం చిన్ను పటేల్, ఏఎంసీ చైర్మన్ ముకాడే ఉత్తమ్, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవన్‌రెడ్డి, ఆదివాసీ సంఘాల నాయకులు గోడం గణేశ్, మెస్రం నాగ్‌నాథ్, పుర్కా చిత్రు, ఆనంద్‌రావ్, మెస్రం నాగోరావ్, కాత్లే పృథ్వీరాజ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్‌ను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ చైన్‌గేట్, ఏప్రిల్ 16 : ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్‌ను వేగవంతం చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల మార్కింగ్, తాగునీటి సమస్య పరిష్కారం వంటి అంశాలపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన మార్కింగ్ వివరాలు, తాగునీటి సమస్య పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాగునీటి సమస్య ఉన్నట్లు సమాచారం అందితే స్పందించాలని, బోరుబావులు, చేతిపంపులు చెడిపోతే మరమ్మతులు చేపట్టి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, ఆర్డీవోలు రత్నకల్యాణి, కోమల్‌రెడ్డి, జడ్పీ సీఈవో గోవింద్, డీపీవో శ్రీనివాస్, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, పీడీ హౌజింగ్ రాజేశ్వర్ పాల్గొన్నారు.